క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



కుమారా రామభీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు శ్రావణ మాసం దశమి కావడంతో ఆలయంలో స్వామి, అమ్మ వార్లకు అభిషేకాలు, పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలైనులో వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కర జిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శనగలు, పులిహోర ప్రసాదం అందించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. పూజలు అనంతరం స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. అదే విధంగా స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, గొంచాలలోని శివాలయంలోను, పీబీ దేవం శివాలయంలోను పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నూకాలమ్మకు వెండి కవచం సమర్పణ



అమ్మవారికి వెండి వస్తువులు తీసుకొస్తున్న దాతలు



అమ్మవారికి దాతలు ఇచ్చిన వెండి వస్తువులు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారికి దాతలు వెండి కవచం, ఆయుధ సహిత హస్తములు, సూర్యచంద్రులను సమర్పించినట్లు ఈఓ రాంబాబురెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విశాఖ పట్టణానికి చెందిన బండారు శ్రీనివాస సత్యేంద్ర, పద్మజ నాయుడు దంపతులు అమ్మవారికి వెండి వస్తువులు సమర్పించారు. దాతలకు ఈఓ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం



కొత్తపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దామని, విద్యుత్ చార్జీల నిలువు దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని ప్రగతిశీల మహిళ సంఘం జిల్లా కమిటీ నాయకురాలు రెడ్డి దుర్గాదేవి అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా సోమవారం విద్యుత్ చార్జీల నిలువు దోపిడీపై కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. మండలం, డివిజన్, జిల్లా కేంద్రాల్లో విద్యుత్ కార్యాలయం వద్ద మంగళవారం జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళ సంఘం నాయకులు గద్దం చిట్టమ్మ, భూషణం, అన్నవరం, రాజమ్మ పాల్గొన్నారు.

మోటారు సైకిల్ చోరీ

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో సోమవారం మధ్యాహ్నం ఇంటి ముందు పార్కు చేసిన మోటారుసైకిల్ దొంగతనానికి గురైంది. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సమయం వెంకటేష్ ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చారు. ఇంటి గుమ్మం ఎదురుగా మోటారు సైకిల్‌ను పార్కు చేశాడు. భోజనం చేసి తిరిగి బయటకు వచ్చి చూసే సరికి మోటారు సైకిలు కనిపించలేదని పోలీసులకు తెలిపాడు. పట్టపగలే మోటారు సైకిల్ చోరీ జరగడంతో ద్విచక్ర వాహనాల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సామర్లకోట: స్థానిక పారిశ్రామిక వేత్త బిక్కిన వెంకటసాయి రాజశేఖర్ ఇటీవల మృతి చెందడంతో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆయన కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ఈ మేరకు రాజశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజశేఖర్ తండ్రి బిక్కిన పరమేశ్వర సాయికి తన సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కవర్‌కాని నిషేధం

- యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- పంట పొలాలకు సంకటంగా మారిన వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు



కొత్తపల్లిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పిఠాపురం: ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి పెను ముప్పుగా తయారైంది . అతిచౌకగా సునాయాసంగా వాడుకలోకి వచ్చిన ప్లాస్టిక్ కవర్ల వినియోగం పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వివాహాది శుభకార్యాలతో పాటు మానవుని నిత్య అవసరాల్లో ఈ ప్లాస్టిక్ సంచుల వినియోగం ఒక టిగా మారిపోయింది. ప్రతి చిన్న అవసరానికి ప్లాస్టిక్ సంచులను వాడుతున్నారు. దీంతో పల్లె ప్రాంతాల్లోనూ ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు విచ్చలవిడిగా పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్ సంచులు వినియోగంపై నిషేధం విధించినప్పటికీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో నిషేధం నీరుగారుతోంది. కఠిన నిర్ణయాలతో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని పర్యావరణ వేత్తలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో రోజూ టన్నుల కొద్ది ప్లాస్టిక్ సంచులు డంపింగ్ యార్డుకు చేరుతున్నాయి. సాధారణ చెత్తా, చెదారం కొన్ని రోజులకు భూమిలో కుళ్లిపోయి పర్యావరణ పరిరక్షణ తోడ్పడతాయి. ప్లాస్టిక్ సంచులు మాత్రం సంవత్సరాల తరబడి ఏ మాత్రం పాడవకుండా భూమిలో ఇంకిపోకుండా ఉండిపోతుండంతో కాలుష్యం కారుమబ్బులా కమ్ముకొచ్చేస్తోంది.

ప్రజల ఆరోగ్యానికి ముప్పు

ప్లాస్టిక్ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు పర్యావరణానికి పెను ముప్పుగా పరిణమించింది. దీనిపై ప్రభుత్వం నిషేధం విధించినట్లు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో 51 గ్రామ పంచాయతీల్లో ప్రతీ రోజు 50 టన్నులకు పైగా చెత్త వస్తోంది. వాటిలో 15 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. లక్షలాది మంది ప్రజలు ప్రతిరోజు వివిధ అవసరాల కోసం పిఠాపురం పట్టణానికి వచ్చి పోతుంటారు. తద్వారా ప్లాస్టిక్ సంచుల విక్రయం విచ్చలవిడిగా జరుగుతోంది.



వరదల్లో కాలువలకు అడ్డుగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాలు (ఫైల్)

పిఠాపురం పట్టణంలో లక్షల్లో కవర్ల వినియోగం

పిఠాపురం పట్టణ పరిధిలో ప్రతీరోజు మూడు లక్షలకుపైగా ప్లాస్టిక్ సంచులు అమ్మకాలు జరుగుతున్నట్లు అంచనా. పట్టణ పరిధిలో 22కు పైగా హోల్‌సేల్ దుకాణాలు, మరో 120కి పైగా చిల్లర దుకాణాలు ప్లాస్టిక్ సంచులను విక్రయిస్తున్నాయి. ప్లాస్టిక్ సంచులతో పాటు గ్లాసులు వినియోగం ఎక్కువగా పెరిగింది. వీటిని నిషేధించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ అమలుచేయడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు తయారు చేసే పరిశ్రమలకు మంజూరు ఉత్తర్వులు రాష్ట్ర స్థాయి అధికారులు ఇవ్వడంతో ఆయా పరిశ్రమలు వాటిని తయారు చేస్తున్నాయి. వాటిని తయారు చేసే పరిశ్రమలపై అధికారులు చర్యలు తీసుకోలేక ప్రజల్లో కట్టడి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు వినియోగించకపోతే పరిశ్రమలు వాటిని తయారు చేయడం మానివేస్తాయని అధికారులు యోచిస్తున్నారు.

కనిపించని చైతన్యం

సామాన్యుల దగ్గర నుంచి ధనవంతుల వరకు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. ఇది ప్రమాదమని తెలిసినప్పటికీ ప్రజల్లో చైతన్యం మాత్రం కనిపించడం లేదు. ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వినియోగించి రోడ్లపై పడవేయడం వల్ల అవి మట్టిలో కలవకపోవడంతో కాలుష్యాన్ని పెంచుతున్నాయి. దీనికి తోడు వినియోగ దారులు మార్కెట్లలో కూరగాయలు, చేపలు, మాంసం వంటి వాటిని ప్లాస్టిక్ సంచుల్లో తీసుకొని వచ్చి కవర్లను డ్రైన్లలో పడవేస్తున్నారు. దీనికి కారణంగా డ్రైన్లలో మురికి నీరు ప్రవహించని పరిస్థితి ఏర్పడుతోంది. వరదల్లోను ప్లాస్టిక్ ప్రభావం కనిపించింది. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుగా మారడంతో కాలువలు పొంగి పొర్లి పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది.

పీజీఆర్‌ఎస్‌కు ఎనిమిది అర్జీలు



పీజీఆర్‌ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించినట్టు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్టు ఆమె తెలిపారు. అనంతరం ఆర్డీఓ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రతిజ్ఞ



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్టేషన్ మేనేజరు రమేష్

సామర్లకోట: రైల్వేస్టేషన్‌తో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ సోమవారం సాయంత్రం స్టేషన్ ఆవరణలో ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రత పక్షోత్సవాల్లో భాగంగా రైల్వే స్టేషన్ పరిధిలో ర్యాలీ నిర్వహించి ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించారు. ఈ మేరకు ముందుగా రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లోని ప్లాటు పారాలు, రైల్వే కాలనీ, విశ్రాంతి గదులు, డార్మెటరీలు, హాస్పిటల్స్, హెల్త్ యూనిట్లు, రైల్వే యూనియన్ కార్యాలయాలు, పరిశీలించారు. ఈ మేరకు ఆయా డిపార్టుమెంట్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల పాట్లు



ఎరువుల కోసం సామర్లకోట సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

సామర్లకోట: మండల పరిధిలో 80 శాతం వరినాట్లు పూర్తి కావడంతో రైతులు ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం స్థానిక సొసైటీకి ఎరువులు రావడంతో రైతులు పరుగులు తీశారు. ఒకేసారి అధిక సంఖ్యలో రైతులు రావడంతో స్థానిక ప్రాథమిక సహకారం సంఘం వద్ద రైతులు తెచ్చిన మోటారుసైకిళ్లు రోడ్లపై పెట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం సొసైటీ సభ్యులు వాహనాలను క్రమ పద్ధతిలో పెట్టారు. సొసైటీ అధ్యక్షుడు పైడి శ్రీనివాసు, సిబ్బంది ఆధార్ కార్డులను తీసుకొని సీరియల్ నంబరు కూపన్లు ఇచ్చారు. ఇటీవల రైతు సేవా కేంద్రం ద్వారా డీఏపీ ఇవ్వడంతో ప్రస్తుతం వరి చేలకు యూరియా కావాల్సి ఉందని రైతులు తెలిపారు. దాంతో ప్రతి రైతుకు నాలుగు బస్తాలు యూరియా ఇవ్వనున్నట్టు సొసైటీ అధ్యక్షుడు తెలిపారు. సొసైటీ ఎరువులు విక్రయించడానికి 2019లో లైసెన్సు అయిపోందని వారికి ప్రస్తుతం కొత్త లైసెన్సుకు దరఖాస్తు చేసినట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రం ద్వారా ఎరువులు విక్రయిస్తున్నట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రం రైతులకు దూరంగా ఉండడం వలన రైతులకు అందుబాటులో ఉండేలా రెండు చోట్ల విక్రయిస్తున్నట్టు చెప్పారు. ప్రతి రైతుకు ఎకరానికి ఒక బస్తా డీఏపీ ఇవ్వడం జరిగిందని, 4 బస్తాలు యూరియా ఇస్తున్నామని మండల వ్యవసాయాధికారి వి.మురీధర్ తెలిపారు. పట్టణ పరిధిలో సుమారు 8 ఎరువులు, పురుగు మందుల షాపులు ఉండగా ఆయా షాపులలో ఎరువుల లభించకపోవడంతో రైతు సేవా కేంద్రాలకు వస్తున్నారని తెలిపారు. ప్రతి రైతుకు ఎరువులు అందే విధంగా చర్యలు తీసుకొంటున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు ఐదో తేదీన మరో లోడ్ వస్తుందని రైతులు ఆందోళన పడొద్దని లేదన్నారు. లిక్విడ్ యూరియా, లిక్విడ్ డీఏపీలపై రైతులకు అవగాహన పెంచుతున్నామని తెలిపారు. సొసైటీ డైరెక్టరు తుమ్మల శ్రీను, సీఈఓ మారుతిబాబు రైతులకు సేవలందించారు.

అంగన్‌వాడీల ధర్నా

కార్యాలయంలో ఫోన్ల అప్పగింత



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పెద్దాపురం: అంగనవాడీ వర్కర్లకు, హెల్పర్లకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేస్ యాప్ రద్దు చేయకుండా పని చేయని ఫోన్లు ఇచ్చి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తారా అంటూ సోమవారం సాయంత్రం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి బేబీ, ఎస్తేర్ రాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న సరకులు పోషన్ ట్రాకర్, బాల సంజీవిని యాప్ ద్వారానే ఇవ్వాలని నిర్ణయించారన్నారు. సరకులన్నీ ఒక్కసారి రావడం లేదని, సరకులు ఇచ్చేటప్పుడు ఫొటోతో పాటు లబ్ధిదారుల ఫొటోలు తీయడం కష్టతరం అవుతుందన్నారు. ఒక్కో సరకు ఒక్కో సారి వస్తే మళ్లీ మళ్లీ యాప్ ద్వారా ఇవ్వడం వల్ల సమయం వృథా అవుతుందన్నారు. తక్షణమే నాణ్యమైన ఫోన్లు అందించి, ఈ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో ఫోన్లు అప్పగించి అక్కడ నుంచి అంగన్‌వాడీలు వచ్చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహలత, మహాలక్ష్మి, రాజేశ్వరి, వాణి, లోవ కుమారి, విజయలక్ష్మి, తులసీ, టిఎల్ పద్మావతి, ఎస్.మంగమ్మ, పాతిమా, సీఐటియు నాయకులు డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరుభూమిని బాగు చేయండి



కాలు పెట్టడానికి కూడా వీలు లేకుండా ఉన్న మరుభూమి



పాడా కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఇంద్రనగర వాసులు

అధికారులకు ఇంద్రనగర్‌వాసుల వినతి

పిఠాపురం: ఆ నలుగురు అడుగు పెట్టాలన్నా నరకం కింద ఉంది. అంతిమ సంస్కారాలు చేయడం ఎంతో ఇబ్బందిగా ఉంది. మరుభూమిని బాగు చేయండంటూ పిఠాపురం ఇంద్రనగర్ వాసులు అధికారులకు విన్నవిస్తున్నారు. తమ పరిధిలో ఉన్న మరుభూమి అడుగు పెట్టడానికి వీలు లేకుండా అసాంఘిక కార్యక్రమాలకు అనువుగా మారిందని దానిని వెంటనే బాగు చేసి తమ ఇబ్బందులు తొలగించాలని కోరుతూ కౌన్సిలర్ బోను దేవ ఆధ్వర్యంలో స్థానికులు సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మరుభూమిలో పిచ్చి మొక్కలు మొలిచి అడుగు పెట్టడానికి వీలు లేకుండా తయారయ్యిందన్నారు. ఇదే అదునుగా భావించిన ఆకతాయిలు, మందు బాబులు మరుభూమిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. స్థానికులు ఎవరైనా మృతి చెందితే అంతిమ సంస్కారాలు చేయడం నరక యాతనగా మారిందన్నారు. అధికారులు వెంటనే స్పందించి మరుభూమిని బాగు చేయించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కార్యాలయంలో పర్యవేక్షణ కీలకం

ఎంపీడీఓల శిక్షణలో ప్రిన్సిపాల్ ప్రసాదరావు



ఎంపీడీఓలకు శిక్షణ నిర్వహించిన ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ కార్యాలయం పర్యవేక్షణ ఎంపీడీఓ బాధ్యత అని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు నెల రోజుల శిక్షణలో భాగంగా సోమవారం ఆయన వారికి శిక్షణ నిర్వహించారు. కార్యాలయ నిర్వాహణ, ఉద్యోగుల పనితీరు, ఇతర పరిపాలన సంబంధిత అంశాలను పర్యవేక్షణ చేయాలని చెప్పారు. మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష చేయాలన్నారు. ఆర్థిక నిధుల వినియోగం బడ్జెట్ నిర్వాహణ వంటి ఆర్థిక లావాదేవీలను ఎంపీడీఓలు స్వయంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యాలయంలోని అన్ని ముఖ్యమైన పత్రాలు, రికార్డులు, ఫైళ్లను పర్యవేక్షించాలన్నారు. ఆర్థిక అవకతవకలను నిరోధించడానికి తగిన సూచనలు, సలహాలను కింది స్థాయి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మండల ప్రజా పరిషత్ పరిధిలోని ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులతోపాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లతో మంచి సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఎంపీడీఓలకు ఉన్న హక్కులను సక్రమంగా వినియోగిస్తూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు ఫిర్యాదులు చేసిన వారికి తగిన సమాధానం ఇచ్చి, సంతృప్తి చెందేలా చూడాలన్నారు. అంతకు ముందు సీనియర్ ఫ్యాకల్టీ చక్రపాణిరావు ట్యాక్సు, నాన్ ట్యాక్సుపై శిక్షణ ఇచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, ఫ్యాకల్టీలు కేఆర్ నిహారిక, కె.సుశీల, శర్మ పాల్గొన్నారు.

ఇంటి ఆవరణలో ఔషధ మొక్కలు నాటాలి

కాకినాడ రూరల్: ఆరోగ్యానికి మేలు చేసే ఔషధ, వనమూలికల మొక్కలు ఇంటి ఆవరణలో నాటుకోవాలని శాస్త్రవేత్త కె.జగన్నాథశర్మ పేర్కొన్నారు. జాతీయ వనమూలికల, ఔషధ మొక్కల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఔషధ మొక్కలు ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా అనేక రకాల సౌందర్య ఉత్పత్తులలో వినియోగిస్తారన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు



ఎంపిక అయిన విద్యార్థులు

సామర్లకోట: రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు మాధవపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.మురళీకృష్ణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెద్దాపురం మహారాణి కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న పాఠశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్-18 విభాగంలో డి.రాజేష్ 1000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధిండం, ఎన్.యుగేష్ 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించగా అండర్-14 విభాగంలో ఆర్.పవన్ గణేష్ జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని వివరించారు. ఎంపిక అయిన విద్యార్థులు ఈనెల 9 నుంచి 11 వరక బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులకు నిరంతరం క్రీడా శిక్షణ ఇచ్చిన వ్యాయమ ఉపాధ్యాయుడు ఎం.గోవిందును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మండల విద్యాశాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య అభినందించారు.

ప్రధాన పైపులైనుకు మరమ్మతులు



ప్రధాన పైపులైను మరమ్మతులకు గురై వృథాగా పోతున్న తాగునీరు

కొత్తపల్లి: వాకతిప్ప శివారు ఉన్న నాగులాపల్లి ఏరియా, పరిసర గ్రామాల రక్షిత మంచినీటి పథకం ప్రధాన పైపులైను మరమ్మతులకు గురవడంతో తాగునీరు కలుషితమవుతోంది. పిఠాపురం- ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప పాత మార్కెట్‌కు వెళ్లే రోడ్డులో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ప్రధాన పైపులైను మరమ్మతులకు గురైంది. దీంతో గత వారం రోజులుగా సుమారు లక్షల లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. ఈ పైపులైను నుంచి కుతుకుడుమిల్లి, కొత్తపల్లి, రవీంద్రపురం, ఉప్పాడ అమీనాబాదు తదితర గ్రామాల్లో ఉన్న ప్రధాన ఓవర్ హెడ్ ట్యాంకులకు తాగునీరు వెళుతుంది. ఈ పైపులైను మరమ్మతులకు గురికావడంతో డ్రైనేజీలో మురుగునీరు కలిసి తాగునీరు కలుషితమవుతోంది. దీంతో ప్రజలు రోగాల పడే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన పైపులైను మరమ్మతులు వెంటనే నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

టీకాల కంటే విలువైనవి తల్లిపాలు



తల్లిపాల విశిష్టతపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ దుర్గాదేవి



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, డాక్టర్లు

పిఠాపురం: పిల్లలకు వివిధ రోగాలు వ్యాపించకుండా ఇమ్యునిటీ పవర్ పెరగడానికి వేసే టీకాల కంటే తల్లి ముర్రుపాలు ఎంతో విలువైనవని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ దుర్గాదేవి అన్నారు. భోగాపురంలో సెక్టర్ సూపర్‌వైజర్ బి.ప్రభావతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మహిళ శ్రీ సంక్షేమ తరపున ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తుంటామన్నారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాలు రోజుకి ఒక టీం చొప్పున తీసుకుని దీనివల్ల తల్లి ముర్రుపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు ఎంత ఉపయోగం తల్లికి కూడా అంతే ఉపయోగం అని తల్లులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. తల్లి మురిపాలు ఇవ్వడం వల్ల పిల్లలకు టీకాలు ఇవ్వడంలో ఆలస్యం అయితే వాటి వల్ల వచ్చే ఇబ్బందులు రాకుండా ఉంటాయన్నారు. ప్రసవం అయిన తర్వాత బరువు తగ్గడానికి గాని గర్భసంచి తిరిగి ఎదస్థితిగా రావడానికి కానీ తల్లికి అండసై క్యాన్సర్ బ్రెస్ట్ క్యాన్సర్ గాని రాకుండా తల్లిపాలు ఇవ్వడం వల్ల ఉపయోగపడుతుందన్నారు. తల్లికి బిడ్డకి మధ్య అనుబంధం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేపాల వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్ పి.జ్యోతి, ఏఎన్‌ఎం బేబీ, ఆశ టి.జ్యోతి, వెంకటలక్ష్మి, జి.పద్మవతి జి.విజయ, పి.లోవకుమారి, రమాదేవి గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే శ్రేయస్కరం

సామర్లకోట: బాలింతలు తల్లిపాలపై అవగాహన పెంచుకోవాలని, బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎండీ సుల్తాన్ బీబీ, ఎన్.ఉమాదేవి, అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాలలో బిడ్డకు అనేక పోషకాలు ఉంటాయని, తల్లి పాలు బిడ్డకు దివ్య ఔషధంగా పని చేస్తుందని చెప్పారు. తల్లిపాలు తాగిన బిడ్డ ఆరోగ్యంగా చురుకు తనంతో ఉంటారని అన్నారు. ఈ విషయాన్ని బాలింతలు గమనించి కనీసం ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. బాలింతలకు ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో ఇస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్లు వెంకటరత్నం, వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.